
సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 1 । నవంబర్ । 2023



99 బోధకుల పోస్టులకు..

జీఆర్‌ఏయూలో 99 బోధకుల పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఆ మేరకు నోటిఫికేషన్ విడుదలైంది.

- 8లో



బైక్ బోల్తా పడి..

బైక్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. తెప్పలవలసలో ఘటన జరిగింది.

- 8లో

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

నరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తు గడువు నవంబర్ 7 వరకు పొడిగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరంలో 8, 10 తరగతులు చదివి ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు.

న్యూస్‌రీల్

ఇద్దరు క్షతగాత్రుల డిశ్చార్జ్

మహారాణిపేట (విశాఖపట్నం): విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడిన వారిలో ఇద్దరిని మంగళవారం డిశ్చార్జ్ చేశారు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సింగపురం గ్రామానికి చెందిన మోహిద వరలక్ష్మి, నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన గొట్ట కమలమ్మను మంగళవారం డిశ్చార్జ్ చేశామన్నారు. విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన నల్ల కుమారి, గాజువాక దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ముర్రు లక్ష్మికి శస్త్ర చికిత్సలు నిర్వహించామని, ప్రస్తుతం వారి పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ కానుకలను బుధవారం ఉదయం నుంచి పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. జిల్లాలో ఈ నెలకు గాను 3,21,940 పింఛన్లు మంజూరయ్యాయని, వీటికి గాను రూ.87.30 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఈ పింఛన్లను గ్రామ, వార్డు వలంటీర్లు బుధవారం ఉదయం నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

జిల్లా పరిషత్‌లో 4న దిశ పై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నవంబర్ 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు దిశ కార్యక్రమ అమలుపై సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజల మానవ అభివృద్ధి కోసం, జిల్లా గ్రామీణాభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ సమన్వయ సమావేశంలో జిల్లా ప్రగతి, లక్ష్యాలపై సమీక్ష జరుగుతుందన్నారు.

'జాతీయ సమైక్యతకు నిదర్శనం వల్లభాయ్‌పటేల్'



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ సమైక్యతకు నిదర్శనమని, ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో జాతీయ సమైక్యతలో భాగస్వాములు కావాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పటేల్ దార్శనికత స్ఫూర్తితో అంతర్గత భద్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపై నడిపించిన మహనీయుడు వల్లభాయ్ పటేల్ అని, ఆపరేషన్ పోలోతో దృఢ సంకల్పంతో భారతదేశంలో అనేక సంస్థానాలను విలీనం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు యర్రగుంట శృతి, ఎస్.వాసుదేవరావు, డి.ప్రసాదరావు, విజయ్‌కుమార్, ఆర్ఐ డి.సురేష్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవన నిర్మాణాలపై దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రాధాన్యత భవన నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ ఇంజనీర్లతో ప్రాధాన్యత భవనాలపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు కాంపోనెంట్లకు మంజూరు చేసిన నిధులను తక్షణమే వినియోగించాలని ఆదేశించారు. ప్రతి భవనంపై చర్చించి పూర్తి చేసి అప్పగించే తేదీలు ఏజెన్సీలకు తెలియజేయాలన్నారు. ప్రతి మండలానికి ఒక జాబితా తయారు చేసి జిల్లా డేటా అందజేయాలని ఎస్ఈని ఆదేశించారు. మెటీరియల్ తీసుకొని పనిచేయని ఏజెన్సీలు ఉంటే వారి వివరాలు తెలియజేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ మూర్తి మాట్లాడుతూ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు అలసత్వం లేకుండా పూర్తి చేయాలన్నారు.

నాటక పరిషత్ నిర్వహణకు ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న నాటక పరిషత్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దూరప్రాంత కళాకారులకు జిల్లా పరిషత్ అతిథి గృహంలో వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. 19 ఎంట్రీలు రాగా, అందులో ఆరు ఎంపిక చేశామన్నారు. ఉత్తమ ప్రథమ ప్రదర్శనకు రూ.5 వేలు, ద్వితీయ ప్రదర్శనకు రూ.3వేలు, తృతీయానికి రూ.2వేలు ఇస్తామని చెప్పారు.

తక్షణ సాయం

గాయం మానక ముందే ప్రభుత్వం సాయం అందజేసింది. విజయనగరం రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి మంగళవారం ఎక్స్‌గ్రేషియా చెక్కులను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ ఆపత్కాలంలో ప్రభుత్వం బాధితులందరికీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించి భరోసా ఇచ్చారు. పరిహారం చెక్కులను అందజేశారు. క్షతగాత్రులకు విజయనగరం ఆస్పత్రిలోనే సాయం అందించారు.

-ఎచ్చెర్ల క్యాంపస్/జి.సిగడాం



రైలు ప్రమాద ఘటనలో మృతి చెందిన అసిస్టెంట్ లోకోపైలట్ చిరంజీవి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శ



జి.సిగడాం: ఎస్‌పిఆర్‌పురం గ్రామంలో మృతురాలు లక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్



జి.సిగడాం: మెట్టవలసలో మృతురాలు సుగుణమ్మ కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మా బాధను చూసి జగన్‌బాబు చలించిపోయారు..



సోమవారం నన్ను ఆస్పత్రిలో సీఎం జగన్‌బాబు పరామర్శించారు. ఎక్కడెక్కడ దెబ్బలు తగిలాయని అడిగారు. ఆరోగ్యం బాగుందా అని అడిగారు. నా కూతురు లక్ష్మి రైలు ప్రమాదంలో చనిపోయిందని చెప్పాను. దీంతో ఆయన చలించిపోయారు. అన్ని విధాలా అండగా ఉంటానని చెప్పారు. ప్రమాదంలో నా కాలు విరిగింది. రూ.10 లక్షల చెక్కును చిన్నశ్రీను, కలెక్టరమ్మ అందించారు. సీఎం చేసిన మేలును మరవలేం.

- కీర్తి రాములమ్మ, జి.సిగడాం

పరిహారం తక్షణమే ఇవ్వడం ఆనందంగా ఉంది



సీఎం జగన్ పరామర్శించి వెళ్లిన మరుసటి రోజే పరిహారం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇంత త్వరగా ఇస్తారని అనుకోలేదు. తగ్గేంత వరకు వైద్యం చేయిస్తామని సీఎం చెప్పారు. రూ.5లక్షలు చెక్కు ఇచ్చారు.

- మజ్రాపు సూర్యనారాయణ, పణుకువలస, బలిజిపేట మండలం, మన్యంపార్వతీపురం జిల్లా

సీఎం స్పందించిన తీరు అభినందనీయం



రైలు ప్రమాద సంఘటన జరగ్గానే సీఎం జగన్ స్పందించిన తీరు అభినందనీయం. మమ్మల్ని పరామర్శించిన వెంటనే చెక్కులు అందజేయడం ఆనందంగా ఉంది. ఏం భరోసా కావాలన్నా సీఎం ఇస్తామని చెప్పారు.

- ఎస్.మిశ్రా, పలాస



జి.సిగడాంకు చెందిన రాములమ్మతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

వారికి జీతం.. ఊరికి జీవం

- ఊరికి ఉపయోగపడేలా ఉపాధి పనులు
- ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధం
- పనుల గుర్తింపులో సిబ్బంది నిమగ్నం
- రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులకే ప్రాధాన్యం
- 90 రకాల పనుల గుర్తింపునకు సన్నాహాలు
- లక్షల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు



మెళియాపుట్టిలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు (ఫైల్)

మెళియాపుట్టి:

ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఓ వైపు వేతనదారులకు పని కల్పిస్తూనే.. మరోవైపు రైతులు, ప్రజలకు ప్రయోజకరంగా ఉండే పనులను గుర్తించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం గ్రామసభలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ పనుల ద్వారా గ్రామాల్లో శాశ్వత ఆస్తుల కల్పనకు అవకాశం లభిస్తుంది. గ్రామసభల్లో గుర్తించిన పనులు చేసుకోవడానికి ప్రతిపాదనలు రూపొందించి, వాటి మంజూరుకు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు.

జిల్లాలోని 30 మండలాల్లో 4.32 లక్షల కుటుంబాలు ఉపాధి జాబ్ కార్డులు పొంది ఉన్నాయి. ఏటా నిర్దేశించిన లక్ష్యం మేరకు వీరందరికీ పని దినాలు కల్పిస్తున్నారు. అదనంగా కూడా చాలా మంది పనిచేస్తున్నారు. ఉపాధి హామీలో అత్యధికంగా పనులు కల్పించి ఖర్చు చేయడంతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు తెచ్చుకోవడంలోనూ జిల్లా ముందంజలో ఉంది.



మెళియాపుట్టి: కేరాసింగిలో పనులు గుర్తిస్తున్న సిబ్బంది

90 రకాల పనుల గుర్తింపు

ఉపాధి పనుల గుర్తింపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 879 పంచాయతీల్లో మొదటి విడత గ్రామసభలు నిర్వహించారు. రెండో విడతలో మరో 500 సభలు పూర్తి చేశారు. ఇప్పటికి 90 రకాల పనులు చేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. గ్రామాల్లో రైతులకు సాగునీరందించే చెరువులు, కాలువలు, చిన్న నీటికుంటలతో పాటు ఇంకుడు గుంతలు, గిరిజనులు, దళితుల భూముల అభివృద్ధి, వారి తోటల్లో రాతికట్టల నిర్మాణం అదేవిధంగా రైతుల తోటల్లో చెట్ల పెంపకం, వాటి చుట్టూ ట్రెంచ్‌లు, కొండవాలు నీరు ఇంకింపజేసే ట్రాగన్ ట్రెంచెస్, ఉద్యాన వన అభివృద్ధి పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటేందుకు కూడా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

స్వగ్రామంలోనే ఉపాధి..

ఉపాధి పనులతో వలస దారుల సంఖ్య తగ్గుతోంది. స్వగ్రామంలోనే పనులు చేసుకుంటూ చాలా మంది వలసలకు దూరంగా ఉంటున్నారు. ఆర్వోఎఫ్ ఆర్ పట్టాలున్న గిరిజనులకు 150 పనిదినాలు కల్పించడంతో అత్యధిక వేతనాలు పొందుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 7.42 లక్షల మంది పనుల్లో పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 10 లక్షల మంది పనిచేయడానికి వీలుగా పనుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అవసరమైన పనులే..



ప్రజలకు అవసరమైన పనులు గుర్తించడానికి సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనల మేరకే గ్రామానికి కావాల్సిన పనులు గుర్తిస్తున్నారు. 10 లక్షల మంది పనిచేయడానికి వీలుగా పనుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఎలాంటి లోపాలు లేకుండా పనుల గుర్తింపు జరగాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

- జీవీ చిట్టిరాజు, డ్వామా పీడీ

సింగిల్ డెస్క్ కింద 154 అనుమతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సింగిల్ డెస్క్ కింద జిల్లాలో 154 అనుమతులు మంజూరు చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సింగిల్ విండో కింద 154 అనుమతులు జారీ చేసినట్లు వివరించారు. సింగిల్ విండో ద్వారా నిర్ణీత సమయంలో సంబంధిత శాఖలు అనుమతులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాకు ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్ కింద రెండు క్లస్టర్లు మంజూరు కాగా ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్, హెల్త్ కేర్ క్లస్టర్ ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రాజెక్టు అప్రూవల్ కమిటీ నుంచి నేషనల్ ప్రాజెక్టు అప్రూవల్ కమిటీకి పంపినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించిన పారిశ్రామిక ప్రోత్సాహక పాలసీ-2023-27 కమిటీ ముందు విధి విధానాలు ఉంచినట్లు తెలిపారు. ఈ పాలసీ ద్వారా పెట్టుబడి రాయితీ, సేల్స్ ట్యాక్స్ రాయితీలు, వడ్డీ సబ్సిడీ, ఏపీఐఐసీలో ల్యాండ్ రిబేటు, విద్యుత్ రాయితీ, మొదలగు రాయితీలు ప్రభుత్వం నుంచి ఇస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న బాలింతల కోసం సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏపీఐఐసీకి పాత్రునివలస దగ్గర భూకేటాయింపు చేశామని, ప్రస్తుత పరిస్థితి గురించి జోనల్ మేనేజర్ యతిరాజును అడిగి ఆయన తెలుసుకున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే పవర్, నీరు, రహదారి తప్పనిసరిగా ఉండాలని, భూమి కేటాయించిన తర్వాత విద్యుత్, నీరు, రహదారులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ద్వారా జిల్లాలో 41 యూనిట్లకు కోటి 76 లక్షల రూపాయలు ఇన్సెంటివ్స్ మంజూరు చేసినట్లు చెప్పారు.

• కదలివచ్చిన సిరుల తల్లి



విజయనగర వీధుల్లో భక్తజన సందోహం మధ్య సిరిమానోత్సవం



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, సిరుల తల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. హుకుంపేటలో ఉన్న సిరిమానుకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం పైడితల్లి దీక్షాపరులు, భక్తులు జయజయధ్వానాల మధ్య చదురుగుడి వద్దకు మధ్యాహ్నం 12:30 గంటలకు తీసుకువచ్చారు. ఆలయం వద్దనే ఇరుసుమాను బిగించి, కట్లు కట్టారు. అమ్మవారికి భోగం పెట్టారు. పూజారి బంటుపల్లి వెంకటరావు వరసగా ఏడోసారి సిరిమానును అధిరోహించారు. ఉత్సవ సంప్రదాయం ప్రకారం సిరిమానోత్సవం సాయంత్రం 4:38 గంటలకు ప్రారంభమైంది. ఆలయం నుంచి కోట వరకూ భాజాభజంత్రీలతో, మేళతాళాలతో అమ్మవారు సిరిమానుపై వస్తుండగా పూర్ణకుంభంతో వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, పైడితల్లి దీక్షాపరుల భజనకీర్తనలు, కళాకారుల డప్పువాయిద్యాలతో స్వాగతం పలికారు. సిరిమానుకు ముందు పాలధార, అంజలి రథం, తెల్ల ఏనుగు, బెస్తవారి వల అమ్మను స్తుతిస్తూ బయలుదేరాయి. పైడిమాంబ మూడుసార్లు పురవీధుల్లో సిరిమాను రూపంలో ఊరేగి, భక్తులకు దర్శనమిచ్చారు. తన పుట్టినిల్లు విజయనగరం కోటవద్దకు వెళ్లి, రాజ కుటుంబాన్ని ఆశీర్వదించారు. ఈ అపూర్వ ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించిన భక్తులు పరవశించిపోయారు.



తెల్ల ఏనుగు

• ఇదే మా హృదయాంజలి



జిల్లా కేంద్రంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక, కొవ్వొత్తి చేతబట్టుకుని నడుస్తున్న ఎస్పీ



శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో అక్టోబరు 21 నుంచి 31వ తేదీ వరకు జరిగిన అమర వీరుల స్మారకోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం డేఅండ్‌నైట్ కూడలి నుంచి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ నిర్వహించారు. ఏడు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉత్సవంలో భాగంగా జిల్లాలో వ్యాసరచన పోటీలు, వైద్య శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, జి.వి. ప్రసాద్, ప్రసాదరావు, విజయ్‌కుమార్, సీఐ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ డి.సురేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విజేతల వివరాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల వివరాలను అదనపు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనూరాధ తెలిపారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ వారి ఆదేశాలతోపాటు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లా విద్యాశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 8, 9 చదువుతున్న బాలబాలికలకు ఈనెల 27వ తేదీన క్విజ్ పోటీలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఆరోజు జరిగిన క్విజ్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 56 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి హాజరయ్యారు. ఇందులో ఎస్.కార్తికేయ, బి.పూర్ణచంద్ర (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాశీబుగ్గ) మొదటి స్థానంలో నిలవగా, కె.వరప్రసాద్, ఎస్.సాయి దేవహర్ష (ప్రభుత్వ (బాలురు) ఉన్నత పాఠశాల శ్రీకాకుళం) ద్వితీయ స్థానంలో, కె.కృష్ణచైతన్య, జి.అగస్త్యరామ్ (ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల) తృతీయ స్థానంలో నిలిచారు. మొదటి మూడుస్థానాల్లో నిలిచినవారికి వరుసగా రూ.5వేలు, 4వేలు, 3వేలు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను నవంబర్ 14వ తేదీన జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ చేతులమీదుగా అందజేయనున్నట్టు ఆమె చెప్పారు.

క్లుప్తంగా

'ఈ-శ్రమ్ లక్ష్యాన్ని చేరుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస, అసంఘటిత కార్మికులకు కార్డులు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. ఆయన తన చాంబర్‌లో మంగళవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా 6,12,408 మంది కార్మికుల నమోదు లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటి వరకూ 4,91,852 మంది కార్మికుల నమోదు పూర్తయిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 80.31 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని, మిగిలిన వారి నమోదు కోసం విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ-శ్రమ్‌లో నమోదైన వివరాలు వచ్చిన వెంటనే రైస్ కార్డులు లేని వారికి కార్డులు ఇవ్వాలని సంబంధిత అధికారులను సూచించారు.

1 నుంచి 3 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: నవంబరు 1 నుంచి 3 వరకు కోర్టు విధులు బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులు బార్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించిన తీర్మానాలపై సమావేశం నిర్వహించారు. అన్ని పిటిషన్‌ల మీద 20 రూపాయల వెల్ఫేర్ స్టాంప్‌ని అంటించాలని చేసిన అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ చట్ట సవరణను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయవాద సంక్షేమ నిధి నుంచి మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు ఇస్తున్న డెత్ బెనిఫిట్స్ రూ.నాలుగు లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



వృద్ధురాలి మృతదేహం

జి.సిగడాం: సంతవురిటి సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం రాజాం-పొందూరు ప్రధాన రహదారిలో వృద్ధురాలి మృతదేహం కనిపించింది. ఈమె బిచ్చమెత్తుకుంటూ గ్రామాల్లో తిరిగేదని, మతిస్థిమితం లేదని స్థానికులు తెలిపారు. స్థానిక హెచ్‌సీ పొగిరి శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మృతి దేహాన్ని రాజాం ప్రభుత్వాస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తుతోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఏపీ రైతు సంఘం 12వ మహాసభ మంగళవారం క్రాంతిభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి అనుకూలించడం లేదని, సాగునీటి వనరులు ఉపయోగపడడం లేదన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ కాలువలు బాగు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 9 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.



• వైద్య సిబ్బందికి వందనం

నందిగాం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ముగిశాయి. ఈ సందర్భంగా నందిగాం మండలం కణితూరులో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. – నందిగాం

వైద్య ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లను సత్కరిస్తున్న పేరాడ తిలక్ తదితరులు

99 బోధకుల పోస్టులకు నోటిఫికేషన్

- బీఆర్ఏయూ చరిత్రలో అతిపెద్ద నోటిఫికేషన్
- అన్ని విభాగాల్లో ఖాళీల భర్తీ

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూ చరిత్రలోనే అతి పెద్ద నోటిఫికేషన్ వెలువడింది. వర్సిటీలో 99 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. 2008 జూన్ 25న విశ్వవిద్యాలయం ఏర్పడింది. విశ్వవిద్యాలయం ఏర్పాటు సమయంలో మాతృ సంస్థ ఆంధ్రా విశ్వవిద్యాలయానికి వెళ్లేందుకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో 34 మంది వెళ్లిపోయారు. కేవలం ఐదుగురు మాత్రమే ఉండగా, 2009 నోటిఫికేషన్‌లో కొత్తగా ప్రారంభించిన బయోటెక్నాలజీలో నాలుగు పోస్టులు, సోషల్ వర్క్‌లో మూడు పోస్టులు మాత్రమే నియమించారు. తర్వాత ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఏడుగురు మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. ఎకనామిక్స్‌లో ఒక ప్రొఫెసర్, బయోటెక్నాలజీలో ఒక ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సోషల్ వర్క్‌లో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు.

దీంతో విశ్వవిద్యాలయంలో 99 టీచింగ్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిలో 62 అసిస్టెంట్ ప్రొఫెసర్లు (అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాడర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్సు), 24 అసోసియేట్ ప్రొఫెసర్లు, 13 ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీచేశారు. నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్ రోస్టర్ మేరకు నవంబర్ 27లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగంలో కెమిస్ట్రీలో 4, కామర్స్‌లో 4, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో 6, ఎకనామిక్స్ రూరల్ డెవలప్‌మెంట్‌లో 4, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 6, ఇంగ్లిష్‌లో 4, ఇంటిగ్రేటెడ్ టీచింగ్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాంలో 12, న్యాయ విద్యలో 4, లైబ్రరీ ఇన్‌ఫర్మేషన్ సైన్స్‌లో 4, మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్‌లో 4, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 6, సోషల్ వర్క్‌లో ఒకటి, అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాడర్ అసిస్టెంట్ డైరెక్టరాఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్సులో ఒక పోస్టు నియామకానికి నోటిఫికేషన్ జారీచేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ విభాగంలో కెమిస్ట్రీలో 2, కామర్స్‌లో 2, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో రెండు, ఎకనామిక్స్ రూరల్ డెవలప్‌మెంట్‌లో ఒకటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో రెండు, ఇంగ్లిష్‌లో రెండు, ఐటీ ఈపీలో రెండు, లాలో రెండు, లైబ్రరీ సైన్స్‌లో రెండు, గణితంలో రెండు, మెకానికల్ ఇంజినీరింగ్‌లో రెండు, సోషల్ వర్క్‌లో ఒకటి, ప్రొఫెసర్స్‌కు సంబంధించి బయోటెక్నాలజీ అండ్ మైక్రోబయోలజీలో ఒకటి, కెమిస్ట్రీలో ఒకటి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ఒకటి, కామర్స్‌లో ఒకటి, ఎకనామిక్స్ రూరల్ డెవలప్‌మెంట్‌లో ఒకటి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో ఒకటి, ఇంగ్లిష్‌లో ఒకటి, ఐటీ ఈపీలో ఒకటి, లా లో ఒకటి, లైబ్రరీ సైన్స్‌లో ఒకటి, గణితంలో ఒకటి, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఒకటి, సోషల్ వర్కులో ఒక పోస్టుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగాల్లో మూడు నోటిఫికేషన్లతో పాటు, బ్యాక్ లాగ్, నాన్ టీచింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాడర్ విభాగంలోని డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు నోటిఫికేషన్ జారీ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో రాష్ట్రం యూనిట్‌గా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అర్హత మార్కులు తప్పనిసరి. అర్హత సాధించిన వారు విశ్వవిద్యాలయాలు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ పోస్టుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఇంటర్వ్యూల్లో పది మార్కులు గరిష్టంగా సీనియారిటీ ఆధారంగా ఏడాదికి ఒక మార్కు చొప్పున వెయిటేజీ ఇస్తారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల్లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఉన్నత విద్యా మండలి నిబంధనల మేరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

అన్ని పోస్టులకు నోటిఫికేషన్



విశ్వవిద్యాలయంలో అవసరమైన అన్ని సబ్జెక్టులకు పోస్టుల కేటాయింపులు జరిగాయి. ఈ మేరకు 99 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాం. వర్సిటీ నిర్వహిస్తున్న ప్రతి కోర్సు బలోపేతం లక్ష్యం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అడిగిన పోస్టులు మంజూరు చేసింది. భవిష్యత్‌లో విద్య బలోపేతంతో పాటు అన్ని అధీకృత సంస్థల గుర్తింపులకు సైతం సమస్యలు ఉండవు. వర్సిటీ పూర్తిస్థాయిలో బలోపేతమవుతుంది.

– ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

గ్రిగ్స్ పోటీల తేదీలు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యంలో జరిగే గ్రిగ్స్‌మీట్ పోటీల తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, ఉపవిద్యాశాఖాధికారి ఎస్. తిరుమల చైతన్య, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావులు షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ షెడ్యూల్‌లో భాగంగా నవంబర్ 4 నుంచి 8వ తేదీలోపు మండల స్థాయి, నవంబర్ 27 నుంచి 30వ తేదీల్లో జోనల్ స్థాయి పోటీలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీలను డిసెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సన్నద్ధత కోసం గురువారం ఉదయం 10 గంటల నుంచి మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో ఉన్న హెచ్‌ఎంలు, పీడీ/పీఈటీలతో విధిగా సమావేశాలను నిర్వహించాలని డీఈఓ వెంకటేశ్వరరావు సూచించారు.

పెద్దపులి కోసం జాయింట్ ఆపరేషన్



సరిహద్దు గ్రామ ప్రజలను హెచ్చరిస్తున్న ఆంధ్రా, ఒడిశా అటవీశాఖాధికారులు

ఇచ్ఛాపురం రూరల్: పెద్దపులి జాడ కనుగొనేందుకు ఆంధ్రా, ఒడిశా అటవీ శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. మంగళవారం కాశీబుగ్గ రేంజ్, ఒడిశా పాత్రపూర్ రేంజ్ అటవీశాఖాధికారులు జాయింట్ సెర్చింగ్ టీమ్‌గా ఏర్పడి అయ్యవారిపేట, లొద్దపుట్టి, జగన్నాథపురం, ఒడిశా పేటూరు, నొవగాం, కోగాం, శారదాపురం గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. ఒడిశా ప్రాంతం గండాహతి నుంచి వచ్చిన ఈ పెద్దపులి పగలంతా సేద తీర్చుకొని, రాత్రి సమయాల్లో సంచరిస్తున్న నేపథ్యంలో ఒంటరిగా బయట తిరగరాదని హెచ్చరించారు. కాశీబుగ్గ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణం నాయుడు, ఒడిశా పాత్రపూర్ రేంజ్ అధికారి అభినాథ్ చౌదరీ, తరునేశ్వర్ సబర్‌ల ఆధ్వర్యంలో డీఆర్‌ఓ రాము, ఎఫ్ఎస్ఓలు బివికె.రెడ్డి, ఆర్.రాఘవయ్య, జి.రాజేందర్, ఎఫ్‌బిఓలు డి.సురేష్‌కుమార్, టి.వెంకటేష్, ఎ.రవికుమార్, ఎం.పోలయ్య, పి.సంతోష్, ఎ.బాబురావులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: పేద ప్రజలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష ఉందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన మంగళవారం కొర్ని పంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొని మాట్లాడారు. మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో శిబిరాలు అద్భుతంగా నిర్వహిస్తున్నారన్నారు. మండలంలో ఇప్పటివరకు 7వేల మందికి వైద్య శిబిరాలకు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పోషకాహార కిట్లను అందజేశారు. మహిళా శిశు సంక్షేమ ద్వారా ఎంపికైన ఇద్దరు అంగన్‌వాడీలకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, సర్పంచ్ పీస గోపి, మండల ప్రత్యేకాధికారి బీవీ రమణమూర్తి, రాష్ట్ర నాటక అకాడమీ డైరక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, పీస శ్రీహరిరావు, అర వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

కోటబొమ్మాళి: అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్తగా ఓటు హక్కు కల్పించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల అధికారులు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. తహశీల్దార్లు జామి ఈశ్వరమ్మ, చలమయ్య, డీటీ ఆర్.మధు, సీఎస్‌డీటీ కె.రాము, ఆర్ఐ శివ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కుటుంబాలు



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస, కాశీబుగ్గ: మందస మండలంలోని అంబుగాం పంచాయతీ లింబుగాం గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో మంగళవారం వారంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. తమది పేదల ప్రభుత్వమని, అందరూ కలసికట్టుగా పని చేసి.. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతం వెనుకబడిందని, దీన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి అప్పలరాజు ప్రత్యేక కృషితో అభివృద్ధి చేశారన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు తదితర అన్ని రంగాల్లో ఉద్దానం నేడు ఉద్యానవనంగా మారిందన్నారు. పార్టీలో చేరినవారిలో పులారి కామయ్య, నర్తు దేవేంద్ర, మల్లేశ్వరరావు, మండల తవిటమ్మ, కరగాన పాపారావు, హేమరాజు, దానమ్మ, పిన్నింటి పున్నయ్య, రాజాన సంతోష్‌కుమార్, సాలీన వరలక్ష్మి, బదకల మహలక్ష్మి, స్వాతి ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్ పాణిగ్రాహి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు సాలీన లక్ష్మీనారాయణ, తిరునగరి నవరయ్య, నర్తు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కోరన్న, మంగన్నలకు ఘనంగా నివాళి



సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మందస: మండలంలోని కొండలోగాం పంచాయతీ కొయ్యాడూరు గ్రామంలో శ్రీకాకుళ పోరాట తొలి అమరులు కోరన్న, మంగన్న వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ నాయకుడు గొరకల బాలకృష్ణ మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధ గిరిజన పోరాటంలో అసువులు బాసిన కోరన్న, మంగన్నలు పోరాటాలకు చైతన్యదీపికలుగా మారారన్నారు. మణిపూర్‌లో కుకీ ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండకు కారకులైన మతోన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. అడవి బిడ్డల అస్తిత్వంపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలను నిర్మించాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ ఉద్దానం, ఏజెన్సీలలో సాగవుతున్న జీడిపంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, 80 కిలోల బస్తాకు రూ.16వేలు ధరగా నిర్ణయించాలని, కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంఘం నాయకుడు సవర నారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కుమారన్న తనయుడు మల్లేశ్వరరావు ఎర్రజెండాను ఎగురవేశారు. సీపీఐఎంఎల్ నాయకుడు హేమ, ఏఐకెఎంఎస్ నాయకులు మాధవరావు, అప్పయ్య, ఐఎఫ్‌టీయు నాయకుడు గోపి, అరుణోదయ నాయకుడు కుత్తుం ఢిల్లీరావు, కారుణ్య, కృష్ణ, రమేష్, లక్ష్మి, వరలక్ష్మి, గీతాంజలి, పుణ్యవతి, గున్నమ్మ, చుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి వ్యక్తి మృతి



రామప్పడు (ఫైల్)

రణస్థలం: మండలంలోని తెప్పలవలస ఎస్సీ కాలనీకి చెందిన యాగాటి రామప్పడు (35) ద్విచక్రవాహనం బోల్తాపడి మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని తెప్పలవలసకు చెందిన యాగాటి రామప్పడు, లావేరు మండలంలోని లావేరు గ్రామానికి చెందిన తోట అప్పలరాజులు విజయనగరం పండగలకు సోమవారం రాత్రి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మంగళవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో పతివాడపాలెం ఫ్లై ఓవర్‌పై ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయారు. తీవ్ర గాయాలతో ఉన్న ఇద్దరిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామప్పడు మృతి చెందారు. అప్పలరాజు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. వీరు పైడి భీమవరంలోని ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. మృతుడికి భార్య భవానీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఏఎస్ఐ సిహెచ్ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీల్లో యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు తప్పనిసరిగా జరగాలని ఈఏపీఆర్డీ కేపీఏ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. అన్ని రకాల అభివృద్ధి, రెవెన్యూ వసూళ్లు డిజిటల్ పేమెంట్ల ద్వారా జరగాలని అన్నారు.

'బాబు మాటలన్నీ బూటకమే'



విలేకరులతో మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఐటీని అభివృద్ధి చేశానని, సైబరాబాద్ నిర్మించానని బాబు చెప్పే కబుర్లన్నీ బూటకమేనని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవి కుమార్ అన్నారు. ఆమదాలవలసలో జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్ని చెప్పుకుంటున్న చంద్రబాబు 2014–19 మధ్యలో ఆంధ్రాలో ఎందుకు సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టించలేకపోయారని ప్రశ్నించారు. ఇక్కడెందుకు సైబరాబాద్ నిర్మించలేదని అన్నారు. హైటెక్ సిటీ చుట్టుపక్కల వందల ఎకరాలను చంద్రబాబు బినామీలు మింగేశారని, అలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారమే అమరావతిలో చేయాలని చంద్రబాబు ప్రయత్నించారని అన్నారు. ప్రజలందరూ వాస్తవాలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు కెప్టెన్ పైడి రామారావు, కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, రాఘవేంద్ర, రామ్మోహన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ కాంట్రాక్టు కార్మికునికి గాయాలు



విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న పరపటి తమ్మయ్య

నందిగాం: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ కాంట్రాక్టు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని కొండల ప్రాంతంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను పెట్టేందుకు ప్రైవేటు కాంట్రాక్టర్ తమ కూలీలను తీసుకువచ్చారు. దీనిలో భాగంగా అన్నాపురంలో ఇటీవల స్థానికంగా ఉన్న జేసీబీ ఢీ కొట్టడంతో విరిగిపోయిన స్తంభాన్ని పాతిపెట్టి తర్వాత హర్షబడ పంచాయతీలో మరికొన్ని స్తంభాలు ఏర్పాటుచేశారు. ఈ సమయంలో లైన్ ఇన్‌స్పెక్టర్ ఎల్‌సీ ఇచ్చి స్తంభాలు వేయించారు. అయితే రామకృష్ణాపురం వద్ద ఉన్న ఒక క్వారీ వద్ద లైన్ ఏర్పాటుకు స్థానిక జేఎల్ఎం షణ్ముఖరావు ఎలాంటి ఎల్‌సీ తీసుకోకుండా, లైన్ ఇన్‌స్పెక్టర్‌కు తెలుపకుండా పని మొదలుపెట్టారు. సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడు పేటకు చెందిన పరపటి తమ్మయ్యను తీసుకొని వెళ్లి స్తంభం ఎక్కించారు. దీంతో విద్యుత్ వైరును తాకగానే షాక్ తగిలి ఎడమ చేయి, వీపుపై కొంత భాగం కాలిపోయింది. దీంతో హుటాహుటిన టెక్కలి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు తీసుకెళ్లారు. దీనిపై ఆ శాఖ అధికారులు సమాచారం ఇచ్చేందుకు స్పందించలేదు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఇద్దరు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఇచ్ఛాపురం: నవంబర్ 5 నుంచి 7 వరకు ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇచ్ఛాపురం జ్ఞానభారతి పాఠశాలకు చెందిన బి.సునీల్(ట్రిపుల్ జంప్), డి.అశ్వద్ధామ(హైజంప్) ఎంపికైనట్లు స్కూల్ కార్యదర్శి జోహార్‌ఖాన్ తెలిపారు. వీరిని మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఐబీ పండా, హెచ్ఎం రషీదా సుల్తానబేగం, ఏఓ ప్రేమ్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్‌పండా, డి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

పోలాకి: తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు మినీ అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న టీచర్ కమ్ హెల్పర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మబగాంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. రూ.7 వేల వేతనంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం అందటం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలకు తమను అర్హులుగా గుర్తించాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

'సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు'



సమావేశంలో మాట్లాడుతున్న పిట్ట చంద్రపతిరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ కులగణన చేయాలన్న నిర్ణయాన్ని స్వాగతించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు అన్నారు. కులగణన చేసేందుకు కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం నగరంలో ఎన్జీఓ హోమ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రపతి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం, పబ్లిక్ లైబ్రరీ, సీతంపేటలో జరిగే ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమ సంఘ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. అలాగే సంఘం శ్రీకాకుళం జిల్లా యువజన అధ్యక్షుడిగా పులారీ దుర్యోధనరావు, జిల్లా ప్రచార కార్యదర్శిగా తుమ్మిడి గంగాధర్‌రావు, శ్రీకాకుళం పట్టణ కార్యదర్శిగా ఉజరావు రవిశంకర్‌ను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో బాడాన దేవభూషణరావు, పిట్టా భాగ్యచంద్ర యాదవ్, అమిరుల్లా బేగ్, మంగరాజు, కుప్పిలి సూర్యరావు, కోరాడ అప్పారావు, పాలిన శ్రీనివాసరావు, జంజూలూరి రామారావు, తిప్పాన గాంధీ, దామోదర కేశవ, కాళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235